క్లుప్తంగా

ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలి



ఈకేవైసీని పరిశీలిస్తున్న ఏడీఏ, ఏఓ

కమలాపురం : అన్నదాత సుఖీభవ పథకం వర్తింపు కోసం రైతులు తప్పని సరిగా ఈకేవైసీ చేసుకోవాలని ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి తెలిపారు. గురువారం మండలంలోని పెద్దచెప్పలి రైతు సేవా కేంద్రంలో అన్నదాత సుఖీభవ పోర్టల్ నందు జరుగుతున్న ఈకేవైసీని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రైతు సమీపంలోని ఆర్ఎస్కేలకు వెళ్లి అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో ఈకేవైసీని తప్పని సరిగా చేసుకోవాలన్నారు. చిన్న, సన్న కారు రైతులు ఆధార్ కార్డు లేదా ఖాతా నెంబర్ ద్వారా ఆర్ఎస్కేలకు వెళ్లి నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ఫార్మర్ రిజిస్ట్రీని కూడా తప్పని సరిగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

నివాళి



నివాళి అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన మాజీ సాక్షి విలేకరి ఈ.రామలక్ష్మిరెడ్డి(32) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. చింతకొమ్మదిన్నె మండలంలో సాక్షి విలేకరిగా పని చేశాడు. కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతూ ఉండేవాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి మృతదేహానికి నివాళి అర్పించి మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రామకృష్ణారెడ్డి, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



కిట్స్ పంపిణీ చేస్తున్న ఎంఈఓ

జమ్మలమడుగు : పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో మొదటి రోజున వచ్చిన విద్యార్థులకు పుస్తకాలను మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు పంపిణీ చేశారు. మొదటి రోజు కావడంతో ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో చాలా తక్కువ మంది హాజరయ్యారు. గురువారం మంచి రోజు అంటూ మరికొంత మంది తమపిల్లలకు ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు చేయించారు. ఎర్రగుంట్ల మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్స్‌ను ఎంఈఓ శివప్రసాద్ పంపిణీ చేశారు.

సోలార్ విద్యుత్‌పై అవగాహన



సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

చింతకొమ్మదిన్నె : స్థానిక సెక్షన్ ఆవరణలో సోలార్ విద్యుత్ ఆవిష్కరణ గురించి గురువారం సోలార్ వెండర్లు, వినియోగదారులు, సిబ్బందితో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆపరేషన్స్ ఈఈ హరిసేవ్యానాయక్ సోలార్ విద్యుత్ వినియోగం యొక్క ఆవశ్యకతను వివరించి వినియోగదారులకు అవగాహన కల్పించారు. సమావేశంలో డీఈఈ రామచంద్రారెడ్డి, రూరల్ ఏఈలు శ్రీ వేణుగోపాలరావు, శివప్రసాద్‌రెడ్డి, జూనియర్ ఇంజనీర్లు రామకృష్ణ, పురుషోత్తం, రూరల్-1 సబ్ డివిజన్ సిబ్బంది, సోలార్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

పెండింగ్ లెప్రసీ అలవెన్సులు చెల్లించాలి

కడప సెవెన్‌రోడ్స్: పెండింగ్‌లో ఉన్న లెప్రసీ అలవెన్సు తక్షణమే చెల్లించాలని ఏపీ ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణి డిమాండ్ చేశారు. కడప కలెక్టరేట్ ఎదుట గురువారం ఆశా వర్కర్లు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు 62 ఏళ్లకు రిటైర్‌మెంట్ వయస్సు, గ్రాట్యూటీ పెంచాలని కోరారు. మెటర్నిటీ సెలవులకు సంబంధించిన జీఓలు జారీ చేయకపోవడం తగదన్నారు. రిటైర్‌మెంట్ ఇస్తే జీఓ ఇచ్చిన తర్వాత విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, నాగసుబ్బారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా మాట్లాడుతూ నాలుగేళ్లుగా ఆశా కార్యకర్తలకు ఇవ్వాల్సిన లెప్రసీ అలవెన్సు పెండింగ్‌లో ఉంచడం అన్యాయమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అలవెన్సు విడుదలైనప్పటికీ ఆశా వర్కర్లకు ఇవ్వకుండా ప్రభుత్వానికి తిప్పిపంపడం దారుణమన్నారు.

వాహనాల పార్కింగ్‌తో అవస్థలు

- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న వ్యాపారస్తులు, వినియోగదారులు



వారపు సంతలో అడ్డదిడ్డంగా పెట్టిన వాహనాలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీ రంగనాథస్వామి కూరగాయల మార్కెట్‌లో ప్రతి గురువారం సంత జరుగుతుంది. అయితే కూరగాయలను కొనుగోలు చేసేందుకు ప్రజలకు, వ్యాపారస్తులకు తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి. మార్కెట్‌కు వచ్చినవాళ్లు తమ వాహనాలను అడ్డగోలుగా ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్లోకి వెళ్లేందుకు దారులులేక ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. దీంతో వ్యాపారస్తులు కూడా ఇబ్బందులు పడుతు



వ్యాపారాల మధ్యనే నిలిపిన వాహనాలు

న్నట్లు తెలుస్తోంది. అధికారులు స్పందించి పార్కింగ్‌కు సరైన ప్రాంతం ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని వ్యాపారస్తులు, వినియోగదారులు కోరుకుంటున్నారు. ప్రతి గురువారం సమస్యగా వాహనాల పార్కింగ్ తయారైంది. నడవడానికి కూడా వీలు లేకుండా వాహనాలు నిలుపుతుండటంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతో కొంతమంది గొడవలకు దిగుతున్నారు. అదేవిధంగా వ్యాపారస్తులు కూడా రోడ్డుపైనే వారికి కేటాయించిన స్థలంలో కాకుండా రోడ్డుపైనే అంగళ్లు పెట్టి మరింత ఇబ్బందికి గురి చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాహనాల పార్కింగ్‌తో ప్రజలకు, వ్యాపారస్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని వారు కోరుతున్నారు.

అంగన్‌వాడీ పిలుస్తోంది... రా

కమలాపురం : నగర పంచాయతీ పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత ఆదేశాల మేరకు సూపర్ వైజర్ జయకుమారి పర్యవేక్షణలో పట్టణంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని తల్లుల మధ్య ప్రారంభించారు. అంగన్‌వాడీ వర్కర్లు తమ సెంటర్ల పరిధిలోని మూడేళ్లు పూర్తి అయిన చిన్నారులందరి తల్లులను కేంద్రాలకు ఆహ్వానించి వారు అందించే సేవలను తెలియజేశారు. చిన్నారులకు పంపిణీ చేసే పౌష్టికాహారం, ఆట పాటలతో అక్షరాలు, పదాలు నేర్పించే విధానాల గురించి అవగాహన కల్పించారు. మూడేళ్లు పూర్తి అయిన మీ పిల్లలందరిని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని, తప్పకుండా వారికి భవిష్యత్తుకు బాటలు వేస్తామని తల్లుకు



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న వర్కర్

సూచించారు. అలాగే బాలింతలు, గర్భిణులు, కిషోర బాలికలకు అందజేసే పౌష్టికాహారం, సేవల గురించి అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఆయా కేంద్రాల వర్కర్లు, హెల్పర్లు, తల్లులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనుల్లో అవకతవకలు

ముద్దనూరు : స్థానిక మండల కేంద్రంలో చేపడుతున్న రహదారి విస్తరణ, అభివృద్ధి పనులు అవకతవకలతో జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానిక 4 రోడ్ల కూడలి నుంచి రైల్వే గేటు వరకు రహదారి విస్తరణ చేపడుతున్నారు. అయితే నిబంధనల కనుగుణంగా కాకుండా నేషనల్ హైవే అధికారులు ఇష్టారాజ్యంగా విస్తరణ పనులు చేపడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. పలుకుబడి వున్న వారి గృహాల వద్ద కొలతల మేరకు విస్తరించకుండా, సాధారణ ప్రజలను మాత్రం ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. 4 రోడ్ల కూడలి నుంచి పాతబస్టాండు వరకు రహదారి ఆక్రమణకు గురైంది. రహదారికి ఇరువైపులా నిబంధనల మేరకు ఇళ్ళ ఆక్రమణలు తొలగించకుండా పలుకుబడి వున్న వారి ఇళ్ళ వద్ద చూసీచూడనట్లు వదిలివేయడం జరుగుతోందని, రహదారిని ఆక్రమించినా కొన్నిచోట్ల డ్రైనేజి కాలువ నిర్మాణం సర్దుబాటుచేస్తున్నారని, కొంతమంది వద్ద ఆర్థికలావాదేవీలు కూడా జరిగినట్లు, దీంట్లో నేషనల్ హైవే సిబ్బంది పాత్ర వున్నట్లు తీవ్ర విమర్శలు వస్తు



విస్తరణ కోసం తొలగించిన ఆక్రమణలు

న్నాయి. ప్రస్తుతానికి ఒకవైపు డ్రైనేజి కాలువ నిర్మాణం పూరైంది. మరో వైపు చేపడుతున్న డ్రైనేజి, విస్తరణ పనుల్లో పక్షపాతధోరణి అధికమైట్లు, నిబంధనలు పాటించకుండా ఎన్‌హెచ్ అధికారులు వారి ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. స్థానిక పాతబస్టాండు కూడలి వద్ద ఆక్రమణలు తొలగించడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, పలుబడి, పక్షపాత ధోరణి విడనాడి నిబంధనల మేరకు విస్తరణ చేపట్టకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని బాధితులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

నేడు నిరసన ర్యాలీని జయప్రదం చేయాలి

పులివెందుల టౌన్ : వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించే ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగభృతిపై జరిగే శాంతియుత నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగపు నియోజకవర్గ అధ్యక్షుడు రామ్‌లక్ష్మణ్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని పాత ఎమ్మెల్యే ఆఫీస్‌లో ఆయన వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగపు జిల్లా కోశాధికారి రాఘవేంద్రారెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని, నీకు 15వేలు, నీకు 15వేలు, మహిళలకు నీకు 18వేలు, నీకు 18 వేలు అని ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి 18వేలు అని కూటమి నాయకులు చెప్పి హామీలు ఇచ్చి ప్రజలందరిని మోసం చేశారన్నారు. నిరుద్యోగులకు కూడా నెలకు రూ.3వేలు ఇస్తానని చెప్పి మోసం చేశారన్నారు. నేడు కడప కలెక్టరేట్ కార్యాలయం వద్ద యువత, విద్యార్థులతో కలసి నిరసన కార్యక్రమం చేపట్టామ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగపు నియోజకవర్గ అధ్యక్షుడు రామ్‌లక్ష్మణ్‌రెడ్డి

ని.. ఆ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మంత్రి నారా లోకేష్ యువగళం పేరుతో ఎక్కడ ఏ విధంగా హామీలిచ్చి మభ్యపెట్టారో అందరికి తెలుసునని, వలంటీర్ వ్యవస్థకు రూ.10 వేలు ఇస్తామని చెప్పి మోసం చేశారని, ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకపోతే రానున్న రోజుల్లో మా ఉద్యమాలు ఉధృతం చేయడంవల్ల తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కడప కల్చరల్: యోగా దైనందిన జీవితంలో ఒక భాగంగా మారితే.. సంపూర్ణ ఆరోగ్యం సొంతం అవుతుందని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం కడప శిల్పారామంలో నగర ప్రజలు, అధికారులకు యోగా మాస్టర్ ట్రైనర్లు యోగా శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథి విశ్వేశ్వర నాయుడు మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగా కార్యక్రమం నిర్వహించారన్నారు. ప్రతి ఒక్కరూ యోగాసనాలపై అవగాహన పెంచుకోవాలని, తద్వారా క్రమశిక్షణ, మెరుగైన జీవన విధానం అలవడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కడప అదనపు మునిసిపల్ కమిషనర్ రాకేష్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడినిచ్చే వంగడాలను గుర్తించాలి

మైదుకూరు : వరి, మినుము, శనగ తదితర పంటల్లో అధిక దిగుబడినిచ్చే వంగడాలను రైతులు గుర్తించాలనిశాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా గురువారం జమ్మలమడుగు మండలంలో కార్యక్రమాలు నిర్వహించారు. మైదుకూరు మండలం వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ అధ్యక్షతన దేవగుడి, ధర్మాపురం, సున్నపురాళ్లపల్లె, పెద్దదండ్లూరు, సుగుమంచిపల్లె, సలివెందుల, చౌడూరు గ్రామాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు అధిక దిగుబడినిచ్చే వంగడాలపై రైతులతో చర్చించారు. అధిక దిగుబడినిచ్చే వంగడాలను రైతులకు సూచించారు. శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ మట్టి పరీక్షలకు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ

అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని సూచించారు. ప్రొద్దుటూరు పశువైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ పశువుల్లో కృత్రిమ గర్భధారణ, వ్యాధి నిరోధక టీకాల గురించి వివరించారు. కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్ ఉద్యాన పంటల్లో సస్యరక్షణ, తెగుళ్ల నివారణ, సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు.

కేసుల విచారణ చేపట్టిన డీఎస్పీ

ముద్దనూరు : మండలంలోని దేనేపల్లె గ్రామంలో రెండు రోజుల క్రితం జరిగిన ఘర్షణ విషయంలో జరిగిన పరస్పర కేసుల విచారణను డీఎస్పీ వెంటకేశ్వరరావు చేపట్టారు. గురువారం ఆయన స్థానిక సీఐ దస్తగిరి, ఎస్ఐ మైనుద్దీన్‌లతో కలసి దేనేపల్లెలోని సంఘటనా స్థలాలకు వెళ్ళి విచారించారు. రామ్మోహన్ అనే వ్యక్తిపై గొడ్డలితో దాడితో పాటు, అదే గ్రామానికి చెందిన వివాహిత మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంపై కేసు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో డీఎస్పీ సాక్షులను విచారించి వివరాలు సేకరించారు. రెండు కేసులపై దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేడు మండల సమావేశం

పెండ్లిమర్రి : స్థానిక ఎంపీడీవో సభాభవనంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

సుబ్బరాజు సేవలు అభినందనీయం

కమలాపురం : సీనియర్ ఉపాధ్యాయులు పి.సుబ్బరాజు సేవలు అభినందనీయం అని సొసైటీ కాలనీ ఎంపీపీ పాఠశాల హెచ్ఎం జయమ్మ తెలిపారు. గత 8 ఏళ్లుగా సొసైటీ కాలనీ పాఠశాలలో విధులు నిర్వహిస్తూ చెన్నూరు గాంధీ నగర్ పాఠశాలకు బదిలీపై వెళ్లిన సుబ్బరాజును ఆమె ఇతర ఉపాధ్యాయులతో కలసి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముద్దం రామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు



కలెక్టర్ చేతులమీదుగా అవార్డును అందుకుంటున్న వివేకానంద పాఠశాల విద్యార్థిని

సింహాద్రిపురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభావంతులైన విద్యార్థులకు అందించే షైనింగ్ స్టార్ అవార్డులకు సింహాద్రిపురంలోని శ్రీవివేకానంద హైస్కూలు విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు కలెక్టర్ శ్రీధర్ చేతులమీదుగా అవార్డులను అందుకున్నారని పాఠశాల కరస్పాండెంట్ ఖాదర్‌వలి తెలిపారు. పాఠశాలకు చెందిన స్నేహలతారెడ్డి, తాహిర్ హుబేన్‌లకు ప్రశాంస పత్రంతోపాటు ఒక్కొక్కరికి రూ.20వేల నగదును కలెక్టర్ అందజేశారు. అవార్డులను అందుకున్న విద్యార్థులకు కరస్పాండెంట్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

పౌర విమానశాఖ మంత్రి రాజీనామా చేయాలి

జమ్మలమడుగు : గుజరాత్‌లోని అహమ్మదాబాద్‌లో ఇండియన్ ఏయిర్‌లైన్స్ విమాన ప్రమాదంలో 241 మంది మరణించారని ఈ ప్రమాదానికి నైతిక బాధ్యతగా పౌర విమానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తన పదవికి రాజీనామా చేయాలని మున్సిపల్ విభాగ జిల్లా అధ్యక్షుడు హృషికేశవరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో మంత్రి పదవులు చేసిన వారు తమ శాఖకు సంబంధించిన చిన్న పొరపాట్లు దొర్లిన నైతికబాధ్యతగా రాజీనామాలు చేశారు. అందులో భాగంగానే 1950లో రైలు ప్రమాదం జరిగితే అప్పటిరైల్వే మంత్రిగా పనిచేసిన లాల్ బహుదూర్‌శాస్త్రి నైతిక బాధ్యత వహిస్తూ తమ పదవికి రాజీనామా చేశారన్నారు. అనంతరం విమాన ప్రమాదంలో మరణించిన వారికి నివాళులు అర్పించారు.

20న ఉచిత సంతాన సాఫల్య శిబిరం

వేంపల్లె : ఈనెల 20వ తేదీన అవోపా, అవోపా మహిళా విభాగం ఆధ్వర్యంలో ఉచిత సంతాన సాఫల్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు అధ్యక్షులు బైరిశెట్టి సునీల్‌కుమార్, పచ్చిపులుసు ప్రవీణలు అన్నారు. స్థానిక వాసవి కల్యాణ మండపంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ ఉచిత శిబిరం అందుబాటులో ఉంటుందన్నారు. కడప నగరానికి చెందిన ప్రముఖ సంతాన సాఫల్య నిపుణులు డాక్టర్ సామసుధచే స్త్రీలకు సంబంధించిన గైనిక్ సమస్యలకు ఉచిత వైద్య సేవలతోపాటు మందులు పంపిణీ చేయనున్నట్లు వారు వెల్లడించారు.

గ్రామ పంచాయతీ ఈఓగా కె.మాధవరెడ్డి



వేంపల్లె : స్థానిక గ్రామ పంచాయతీ ఈఓగా కె.మాధవరెడ్డిని నియమించారు. ఈ మేరకు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. మైలవరం మండలం వేపరాల గ్రేడ్-2 గ్రామ పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న కె.మాధవరెడ్డి వేంపల్లి గ్రేడ్-1 గ్రామపంచాయతీ అధికారిగా పదోన్నతి పొందారు. మార్చి 6న వేంపల్లె గ్రామపంచాయతీ ఈఓగా పనిచేస్తున్న నిమ్మకాయల వెంకటసుబ్బారెడ్డి అవినీతి ఆరోపణలపై సస్పెండ్ అయ్యారు. ఆ తర్వాత రెండు నెలలుగా ఎవ్వరూ రాకపోవడంతో వేంపల్లె గ్రామ పంచాయతీలో చెత్తాచెదారాలు, డ్రైనేజీ వ్యవస్థలు అధ్వానంగా తయారయ్యాయి. డ్రైనేజీ, పారిశుద్ధ్య వ్యవస్థలపై కలెక్టర్ చొరవ తీసుకోవాలని ప్రతి రోజు పత్రికల్లో వార్తలు రావడంతో అన్నమయ్య జిల్లా చిట్వేలు గ్రామ పంచాయతీ నుంచి మే 1వ తేదీన రామసుబ్బారెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. అయితే ఆయన ఒక నెల మాత్రమే పనిచేసి రిలీవ్ అయ్యి యథాస్థానం చిట్వేలికి వెళ్లిపోయారు. తర్వాత కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి ఈనెల 9వ తేదీన మైలవరం మండలం వేపరాల గ్రామపంచాయతీ నుంచి కె.మాధవరెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు పంపారు. అయితే ఇప్పటికి కూడా ఆయన బాధ్యతలు స్వీకరించలేదు. వేంపల్లె గ్రామపంచాయతీలో టీడీపీ నేతల ఆధిపత్య పోరుతో ఏ అధికారి కూడా ఇక్కడ పనిచేసేందుకు ఇష్టపడటం లేదు. టీడీపీలో రెండు వర్గాలు ఉండటంతో అధికారులు మేము చెప్పిన మాట వినాలి... ఇంకో వర్గం మేము చెప్పిందే చేయాలంటుండటంతో అధికారులకు తలనొప్పిగా మారింది. మాధవరెడ్డి కూడా వస్తారో, రారో తెలియడం లేదని పలువురు చెబుతున్నారు. గ్రామపంచాయతీ సిబ్బందికి గత ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో పనిచేసేందుకు కూడా ఇష్టపడడం లేదు. గ్రామపంచాయతీ ప్రజలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక నానా అవస్థలు పడుతున్నారు. ఎక్కడ చూసినా చెత్తాచెదారాలు నిండి దుర్వాసన వెదజల్లుతున్నాయి. వృద్ధులు, చిన్నపిల్లలు రోగాల బారిన పడుతున్నారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా గ్రామపంచాయతీ పరిధిలో జనన, మరణ ధృవీకరణ పత్రాల కోసం ప్రతిరోజు గ్రామపంచాయతీ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

వల్లూరు (చెన్నూరు) : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ నిర్వహించారు. గురువారం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొని కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పుస్తకాలను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లతో సమానంగా భావించి వీటినే చక్కగా ఉపయోగించుకుని చదువులో రాణించి, ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. గత సంవత్సరం ఉత్తమ ప్రతిభ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ, ఈ విద్యా సంవత్సరంలో గతంలో కంటే మెరుగైన ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాల ఉపాధ్యాయులకు మం



విద్యార్థులకు కిట్లను అందజేస్తున్న అధికారులు

చి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీసీ నిత్యానందరాజు, ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు, తహసీల్దార్లు సరస్వతి, సునీత, ఏఎంఓ వీరేంద్ర, ఎల్‌సీ కో ఆర్డినేటర్ విశ్వనాథరెడ్డి, ఐడీ కో ఆర్డినేటర్ రమణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రత్నాదేవి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఈ ఏడాది ఒక్క సిలిండర్‌తోనే సరిపెట్టారు

పులివెందుల రూరల్ : అధికారం కోసం కూటమి ప్రభుత్వం ప్రజలకు అనేక అబద్ధాల హామీలు ఇచ్చింది. అమలు కానీ హామీలు ఇచ్చి అందులో మహిళలను ప్రభావితం చేసిన ఉచిత గ్యాస్ పథకం ప్రతి ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామని గొప్పగా ప్రచారం చేశారు. కానీ ఇప్పుడు పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. 2024-25లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎన్నికల్లో చెప్పిన విధంగా ఉచిత గ్యాస్ పథకం కింద మూడు సిలిండర్లు ఇవ్వాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు ఒక్క సిలిండర్‌ను మాత్రమే లబ్ధిదారులకు ఇచ్చిందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు సిలిండర్లకు ఎగనామం పెట్టారని లబ్ధిదారులు వాపోతున్నారు. విద్యుత్ బిల్లు ఎక్కువగా ఉందని,



కొందరికి ఇంట్లో అంగన్‌వాడీ కార్యకర్త, ఆశా కార్యకర్త ఉన్నారని, మరికొందరికి ఇలా అనేక కారణాలతో లబ్ధిదారులకు అందించాల్సిన ఉచిత రాయితీని ప్రభుత్వం ఎగ్గొట్టేందుకు ప్రయత్నిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా కూటమి నాయకులు చెప్పిన విధంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా చీనీ కాయల గ్రేడింగ్ మిషన్



పులివెందులలోని చీనీ కాయల గ్రేడింగ్ మిషన్

పులివెందుల రూరల్ : పులివెందుల నియోజకవర్గంలోని రైతులు పండించిన చీనీ కాయలను ఎక్కడికో వెళ్లి గ్రేడింగ్ చేసుకుని విక్రయాలు చేసుకునేందుకు ఇబ్బందులు పడుతుండేవారు. ఈ విషయాన్ని గమనించి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతులు పండించిన చీనీ కాయలను గ్రేడింగ్ చేసుకునే విధంగా సుమారు రూ.40 లక్షలతో గ్రేడింగ్ మిషన్‌ను కొనుగోలు చేసి ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పులివెందులలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న గ్రేడింగ్ మిషన్ నిరుపయోగంగా ఉంది. ఈ మిషన్ ఏర్పాటు చేయడం వల్ల నాలుగు రకాల చీనీ కాయలను గ్రేడింగ్ చేయవచ్చునని సంబంధిత అధికారులు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధకారంలోకి వచ్చిన ఏడాదవుతున్నా మార్కెట్‌లో చీనీ కాయల గ్రేడింగ్ మిషన్ గురించి సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో అది నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా సంబంధించి అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న గ్రేడింగ్ మిషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి చీనీ కాయలను పులివెందుల్లోనే గ్రేడింగ్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

తెలుగు సాహిత్య జ్ఞానపీఠంగా సినారె

కడప కల్చరల్: తెలుగు సాహిత్యానికి జ్ఞానపీఠంగా మరువలేని అంశాలను డాక్టర్ సి.నారాయణరెడ్డి సమకూర్చారని రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి అన్నారు. సి.నారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా కడప రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ తెలుగు సాహితీ వేత్తగా, పరిశోధకుడిగా, సినీ గీతాల రచయితగా తెలుగు సాహిత్య పీఠానికి వెలుగులద్దిన ఘనత డాక్టర్ సి.నారాయణరెడ్డికే దక్కుతుందన్నారు. మనిషిలోని మమతానురాగాలను, బాధలను, కన్నీళ్లను తన రచనల్లో మనోజ్ఞంగా తీర్చిదిద్దిన అక్షర శిల్పి అని కొనియాడారు. సమితి కోశాధికారి గుడ్ల ఆదినారాయణ రెడ్డి ప్రసంగిస్తూ నారాయణరెడ్డి సాహిత్య కృషికి జ్ఞానపీఠ అవార్డు రావడం చాలా అభినందనీయమన్నారు. ఆయన ఎన్నో డాక్టరేట్లు, అత్యున్నత పదవులు పొందారని తెలిపారు.



డాక్టర్ సి.నారాయణరెడ్డి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్డి సేవా సమితి ప్రతినిధులు